# ఆరవ ప్రసంగము

ఒక సమయమున బేచరభాయి (కవివిహారి), మరి నలుగురు అయిదుగురు మనుష్యులతో శ్రీప్రకాశానందస్వామి, గోండలు నుండి షీరడియా వెళ్ళిరి. అచట రాత్రి భోజనానంతరము బేచర భాయి శ్రీ నిత్యానందులవారిని ప్రశ్నించిరి— "కల్యాణప్రాప్తికి ఉపాయమేమి ?"

## కల్యాణప్రాప్తికి ఉపాయము.

శ్రీ నిత్యానందులు ఈ ప్రశ్నకు సమాధానము చెప్పుడని శ్రీప్రకాశానందులవారిని కోరిరి. అంతట స్వామివారు ఇట్లు సెలవిచ్చిరి :—

కబీరు సాహబు చెప్పెను :—

"కరణీ బిన కథనీ కథే అజ్ఞానీ దినరాత్;
కూకర జ్యుం భూకత ఫిరే, సునీ, సునాయే బాత్.

"ఇట్లు అజ్ఞాని శాస్త్రాభ్యాసము కొంచెముచేసి, పది పదు నైదు ఉపన్యాసములు తయారుచేసుకొని ప్రతిచోటను ఉపదేశించు చుండును. కాని తాను ఆప్రకారము సంచరించడు."

ఆ కబీరే ఇట్లు చెప్పెను :—

"జేసీ బానీ ముఖ కహే, తేసీ చాలే నాహి,
మనుష్య నహి ఏ శ్వాన హై, బాంధే జమపురి జాహీ."

"తాను చెప్పినట్లు సంచరించని మానవుడు శునకముతో సమానము. అతడు బంధనములచే బద్ధుడై యమలోకమునకు బోవును."

కావున నేను కుక్కజన్మముతో యమలోకమునకు పోవలె ననియా మీ ఉద్దేశ్యము?

స్వా॥ ని॥ :—యమలోకము తమకు చాలదూరముగా ఉన్నది. దయతో రెండుమాటలు చెప్పండి.”

## కల్యాణ శబ్దమునకు అర్థము

శ్రీ ప్రకాశానందస్వామివారు ఇట్లు ప్రశ్నించిరి—

అసలు కల్యాణమనగా అర్థమేమి?

బేచరభాయి:—కల్యాణమనగా మోక్షము, దుఃఖవినాశనము; పరమానందప్రాప్తి.

స్వా॥ ప్ర॥ :— అయితే ఎవరికి కల్యాణము? శరీరమునకా? ఆత్మకా? అనేక పర్యాయములు జనులు వచ్చి “శరీరమునకు కల్యాణ మెట్లు కలుగును?” అని అడిగిరి. మంచిమంచి పదార్థములను భుజించుటవలనను, సుందరవస్త్రాదిభూషణములను ధరించుటవలనను, వాహనములపై సంచరించుటవలనను, సినీమాలకు, నాటకములకు వెళ్ళుటవలనను అనగా విషయసుఖములను అనుభవించుటవలన కలుగునని వారు తలచుదురు.

## చార్వాకమతము.

విషయభోగమే సుఖము. ముల్లు గ్రుచ్చుకొనుట మొదలగు వానివలన కలుగు దుఃఖము ప్రత్యక్షదుఃఖము. ప్రత్యక్షమగు సుఖదుఃఖములే నిజమగు సుఖదుఃఖములు. అవి తప్ప మిగిలినవి సుఖదుఃఖములు కావు. కావున సర్వవిధముల విషయములను అనుభవించుటయే పరమసుఖము అని చార్వాకమతము.

చార్వాకమతము ననుసరించు మానవుడు ఆత్మయొక్క అస్తిత్వము, స్వర్గనరకములు, పుణ్యపాపములు, బంధమోక్షములు— వీటిని అంగీకరించడు.

“చైతన్యవిశిష్టః కాయః పురుషః:— “చైతన్యముతోకూడిన శరీరమే పురుషుడనియు, “అన్నరసమయోఽయంపురుషః :—అన్నరసములు

కల ఈస్థూలశరీరమే ఆత్మ అనియు ఆతడు తలచును. కావున విషయసుఖమే సుఖమనియు అంతకు మించి ఆత్మసుఖమనునది లేదనియు ఆతని దృఢనమ్మకము.

## ఇప్పటి శుష్కజ్ఞానుల మతము.

శుష్కజ్ఞానులు చార్వాకునివలె చైతన్యమును రెండురకములుగా అంగీకరింతురు. సామాన్యము, విశేషము. సామాన్యచైతన్యము అంతటను ప్రసరించియుండును. విశేషచైతన్యము జీవాత్మ. అగ్ని, సర్వపదార్థములయందును సామాన్యరూపములో నుండి, దీపము, నిప్పు మొదలగువానియందు విశేషరూపమున కన్పట్టును. దీపము నార్పినప్పుడు అగ్ని అచ్చటనే లయమయిపోవునట్లు జీవాత్మ మృత్యుసమయమున సామాన్యచైతన్యమునందు లయమగును. అంతియేకాదు. జన్మమరణములు, స్వర్గనరకములు, బంధమోక్షములు, పుణ్యపాపములు మొదలగునవి కపోలకల్పితములనియు వారు తలతురు. ప్రజలకుమాత్రము వారు ధర్మోపదేశము చేయుదురు. కాని వారి అంతర్వర్తనము విపరీతముగా నుండును. వేదశాస్త్రములను అంగీకరించరు. సుఖభోగములయందు మునిగియుందురు. ఈశుష్కజ్ఞానులు కబుర్లలో ధర్మాత్ములు; ఆచరణమునందు చార్వాకులు.

## అసుర సంపద

శ్రీమద్భగవద్గీతయందు శ్రీకృష్ణభగవానుడు అసురసంపదను పోషించు చార్వాకమతమును ఉద్దేశించి చెప్పెను. "కామోపభోగపరమాః" వారు విషయోపభోగమే పరమాశయముగా భావింతురు. "కామ ఏవైకః పురుషార్థః" విషయభోగమునకు ఉపయోగించు పదార్థములకొరకు ప్రయత్నించుటయే పురుషార్థము; వేరొక పురుషార్థము లేదు. ఇది వారి అభిప్రాయము.

బృహస్పతి అను చార్వాకుడు ఇట్లు చెప్పెను:—

*యావజ్జీవం సుఖం జీవేత్, ఋణం కృత్వా ఘృతం పిబేత్।*
*భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః॥*

"బ్రతికి ఉన్నంతకాలము సుఖముగా బ్రతుకవలయును. అప్పుచేసి అయినను నెయ్యి మొదలగు మంచిమంచి పదార్థములు భుజించవలెను. చచ్చిపోయిన తరువాత భస్మీభూతమైన శరీరము మరల ఎట్లు వచ్చును?"

కావున ప్రపంచమునందలి విషయసుఖములను ఎప్పుడును విడువరాదు. ప్రత్యక్షమగు విషయసుఖమే నిజమగు సుఖము. స్వర్గాదులు సుఖములు కావు. దుఃఖములు కలసిఉన్నను విషయ సుఖమే నిజమగు సుఖము. ఈవిషయమున చార్వాకుడు ఇట్లు చెప్పెను :—

*త్యాజ్యం సుఖం విషయసంగమజన్మ పుంసాం*
*దుఃఖోపసృష్టమితి మూర్ఖవిచారణైషా ।*
*వ్రీహీన్ జిహాసతి సితోత్తమతణ్డులాఢ్యాన్*
*కో నామ భోస్తుషకణోపహితాన్ హితార్థీ॥*

"స్త్రీసంగ విషయోపభోగజన్యమగు సుఖము దుఃఖమిశ్రితమైనందున పురుషులకు ఆసుఖము విడువదగినది అని మూర్ఖుల యాలోచన. తెల్లటి చక్కని బియ్యముతోనిండిన వడ్లు ఊక, చిట్టు మున్నగు వాటితో కలిసియున్నవనే కారణముచే ఆవడ్లను ఎవడైనా విడువ గోరునా?"

## ఆత్మకల్యాణమునకు ఉపాయము.

బేచరభాయి :—అవన్నియు శరీరమునకు కల్యాణము కలుగుటకు ఉపకరించును. నేను ఆత్మకల్యాణమునకు సంబంధించి అడుగు చున్నాను.

స్వా॥ ప్రి॥ :—ఆత్మ శరీరమునకు భిన్నము అని తలచుచున్నారా?

బేచర॥ :—అయితే నేను చార్వాకుడనా ?

స్వా॥ ప్రి॥ :—ఈమధ్య చాలమంది సంస్కర్తలు చార్వాకులుగా కన్పట్టుచున్నారు. వారిదృష్టిలో మతము ఒక తమాషా అయినది.

బేచర॥ :—అయితే నేను సంస్కర్తను కానుగదా!

స్వా॥ ప్రి॥ :—మీరు సంస్కర్తలు కారు లెండి. కాని, వేదాంతగోష్ఠి ప్రసంగములు చేసేవారు మోక్షప్రాప్తికొరకు ప్రవర్తించువారు కారు. కాని,కబుర్లుమాత్రము మనోరంజనార్థము చెప్పుచుందురు. ఈవిషయమున శ్రీశంకరులు ఇట్లు చెప్పిరి :—

*కృతిపర్యవసానైవ మతా తీవ్రముముక్షితా,*
*అన్యా తు రఞ్జనామాత్రా యత్ర నో దృశ్యతే కృతిః॥*

"తీవ్రమైన ముముక్షుత్వము ఆచరణయే గమ్యస్థానముగా కలది. ఇతరవిధమైన ముముక్షుత్వము మనోరంజనమే ప్రయోజనముగా కలది. అచ్చట ఆచరణ కాన్పించదు."

ముముక్షుత్వము అనగా మోక్షము పొందవలెనను కోరిక. అనగా దుఃఖములనుండి ముక్తిపొందవలెనను కోరిక. నీటినుండి బయటపడిన చేప ఏదోవిధముగా నీట పడుటకు గిలగిల కొట్టుకొనును. నీట పడినప్పుడే దానికి శాంతి కలుగును. మండుచున్న అడవిలోనున్న పక్షి ఎంతైనను శ్రమపడి బయటకు వచ్చివేయును. ఇటులనే మాయలో చిక్కుకొని ముక్తికొరకుచేయు మహాప్రయత్నము తీవ్రముముక్షుత్వము.

పూర్వము శ్రీశుకులు వామదేవాది గురువుల చెంతకు వెళ్ళి యోగవిద్యను నేర్చుకొని గుహలు మొదలగు ఏకాంతస్థలములందు కూర్చొని యోగాభ్యాసము చేయవలసియుండెను. యోగము

సిద్ధించిన తరువాత అక్కడినుంచి బయటకు రావలసియుండెను. ఇప్పుడును కొందరు గురువుల చెంతకు ఉపదేశమునకు వెళ్లెదరు. మరికొందరు కథాకాలక్షేపమునకు వెళ్లెదరు. ఇంకమరికొందరు సత్సంగము చేయుదురు. కాని, క్రియ శూన్యము. అనగా మాయనుండి ముక్తిని పొందుటకు ప్రయత్నించరు. ఒట్టి కబుర్లపోగులు. కొందరికి తాగుడు ఇష్టము. కొందరికి జూదము సరదా. కొందరికి టెన్నిసు ఆడుట ఇష్టము. అవి ఎట్లు మనోరంజనమునకు ఉపయోగపడునో అటులనే వేదాంతశ్రవణము ఈరోజులలో మనోరంజనమునకు ఉపయోగపడుచున్నది.

ఖేచర॥:—తమదయవలన నాకు తీవ్రముముక్షుత్వము లభ్యము కావచ్చును.

స్వా॥ ప్ర॥ :—మీరు ముముక్షువులే కావచ్చు. కాని నాకు మాత్రము బ్రహ్మానుభవము కలుగలేదు.

*బ్రహ్మ నాస్తీతి యో బ్రూయాత్ ద్వేష్టి బ్రహ్మవిదం చ యః।*
*అభూత బ్రహ్మవాదీ చ త్రయస్తే బ్రహ్మఘాతకాః॥*

"బ్రహ్మము లేదనిచెప్పువాడును, బ్రహ్మజ్ఞానిని ద్వేషించువాడును, బ్రహ్మజ్ఞుడను అని చాటుకొనువాడును—వీరు ముగ్గురును బ్రహ్మహత్య చేసినవారలే." అనుభవము జరుగనిదే తాను బ్రహ్మజ్ఞుడను అని చెప్పుకొనువాడును అట్టివాడే. నేను అట్టి బ్రహ్మహత్యా మహాపాతకముచేసినవారిలో ఎట్లు చేరగలను? నేను ఆత్మజ్ఞానిని మాత్రము కాను. కావుననే బ్రహ్మవిద్యావిషయమున ఏమియు చెప్పుటకు తగినవాడను కాను.

## బ్రహ్మ విచారము

స్వా॥ ని॥ :—ఒకరు ఉపన్యసించుట, మిగిలినవారు వినుట అనే పద్ధతి తప్పు కావచ్చు. కాని నలుగురు ఒకచోట జేరి పరస్పరము బ్రహ్మవిచారము చేయుటలో తప్పేమి ఉన్నది?

*తత్కథనం తచ్చిన్తనమన్యోన్యం తత్ప్రబోధనమ్।*
*ఏతదేకపరత్వం చ బ్రహ్మాభ్యాసం విదుర్బుధాః॥* (పఞ్చదశీ)

"ఆత్మనుగురించి చెప్పుట, ఆలోచించుట, పరస్పరము తెలియజేసికొనుట ఆత్మతత్వమునందు నిమగ్నమగుట- ఇవి అన్నియు బ్రహ్మవిచారములో చేరును."

గురుశిష్యుల పద్ధతిని అనుసరించి కాక, జిజ్ఞాసువుల సమూహముగా ఏర్పడి పరస్పరము ఆత్మవిచారము చేయువారికి అనేక విషయములు తెలియును.

## ఆత్మ స్వరూపము.

శ్రీ ప్రకాశానందస్వామి బేచరభాయిని అడిగిరి. ఆత్మస్వరూపము ఎట్టిది?

బేచర :—నాకు తెలిసినచో తమరిని ఏల నడుగుదును?

స్వా॥ ప్ర॥ :—మీరు పంచదశి మొదలగు గ్రంథములు చదివితిరికదా?

బేచర:—ఏదో పుస్తకాలు చదివితిని. ఒకడు అక్కౌంటులు వేసినంత మాత్రమున అందుకానవచ్చు సంపద వానికి చేకూరదు గదా!

## ఆత్మసంపదకు ఆప్తోపదేశములు, ధ్యానము అవసరము.

స్వా॥ ప్ర॥:—సంపద రెండు రకములు— 1) సువర్ణాదులు, 2) ఆత్మసంపద. సువర్ణాదులు విషయోపభోగమునకు పనికివచ్చు వస్తువులను ప్రాప్తింపజేయును. వానివలన ఆత్మసంపద లభించదు. ఆత్మసంపదకు ఆప్తోపదేశములు, శ్రవణాదులు కావలెను.

శ్రీ శంకరులు చెప్పిరి :—

*ఆప్తోక్తిం ఖననం తథోపరి శిలాద్యుత్కర్షణం స్వీకృతిమ్।*
*నిక్షేపః సమపేక్షతే న హి బహిః శబ్దైస్తు నిర్గచ్ఛతి॥*

*తద్వద్ బ్రహ్మవిదోపదేశమననధ్యానాదిభిర్లభ్యతే ।*
*మాయాకార్యతిరోహితం స్వమమలం తత్త్వం న దుర్యుక్తిభిః ॥*

"భూమిలో దాచబడిన నిక్షేపము, ఆప్తవచనము, త్రవ్వట, రాళ్ళు, మట్టి మున్నగువాటిని తీయుట, పిదప స్వీకరించుట—వీటిని పేక్షించును. బయట కూర్చొని కేకలువేసిన అది పైకి రాదు. అటులనే మాయాకార్యములచే కప్పివేయబడిన నిర్మలమైన ఆత్మ తత్త్వము, బ్రహ్మవేత్తల ఉపదేశములు, మననము, ధ్యానము మున్నగువాటివలన లభ్యమగునే గాని కుతర్కములచే లభ్యము కానేరదు."

## ఆప్తోపదేశము

ఆప్తోపదేశము అనగా ఆప్తులుచెప్పుమాటలు. సాంఖ్యసూత్రి మున "ఆప్తోపదేశః శబ్దః" అని చెప్పబడినది. ఆప్తులమాటలు శబ్ద ప్రమాణము. ఆప్తుడు అనగా తనకు తెలిసిన యదార్థమును చెప్పువాడు.

ఒక ధనాఢ్యుడగు గృహస్థుడు ఉండెను. తన తరువాతివారికి ఉపయోగించుటకు ఛాలధనము రహస్యముగా దాచి ఉంచవలెనని అతడు తలచెను. తాను కట్టించిన ఒక శివాలయమునందు ఎవరికి తెలియకుండ ధనమును దాచి ఆవిషయమును తన పుస్తకమునందు వ్రాసికొనెను. ఫలానా సంవత్సరమున సూర్యుడు ఉత్తరాయణమున ఉండగా చైత్రమాసమునందు ఫలానా రోజున ఫలానా సమయ మున దేవాలయపు శిఖరకలశమునందు 25 లక్షల బంగారునాణెములు ఉంచితిని. అవసరమైనప్పుడు తీసికొనవచ్చును. ఇట్లు వ్రాసి అతడు యాత్రకు వెళ్లెను. అతడు అక్కడే మరణించెను. కొంతకాలమునకు అతని కుమారుడు పెద్దవాడయి వ్యాపారముచేసి నష్టపడెను. ధనము నకు ఎక్కువ బాధపడెను. ఒకానొక సమయమున అతడు పాతపుస్త

నములను వెతుకుచుండెను. అందు పూర్వము తనతండ్రి వ్రాసిన ధనమునకు సంబంధించిన విషయము బయటపడెను. అంతట అతని ఆనందమునకు మేరలేదు. ఆతడు ఆపుస్తకములో చదివినప్రకారము శిఖరకలశమును జూచెను. కాని అక్కడ ధనము లేకుండెను. శిఖరమునుకూడ త్రవ్వి చూచెను. కాని ధనము లేదు.

అనంతరము ఒకబుద్ధిమంతుడు ఇది తెలిసికొని శిఖరము, దానిపై కలశము ఉన్నది ఉన్నట్లు కట్టించమని సలహా ఇచ్చెను. కాని అట్లు చేయుటకు అతనివద్ద ధనము లేదు. ఆ బుద్ధిమంతుడే ధనము నిచ్చి వాటిని యథాప్రకారము నిర్మించెను. ఉత్తరాయణమున ఆపుస్తకమున వ్రాసిన సమయము వచ్చెను. ఆసమయమున శిఖరకలశపు నీడ ఎక్కడపడెనో అక్కడ త్రవ్వమని చెప్పెను. అచ్చట ఆ ధనవంతుని కుమారునకు 25 లక్షల బంగారు నాణెములు దొరకెను. ఆతడు మరల ధనవంతుడయ్యెను.

## మాయాకార్యతిరోహితము.

ఈ ఆత్మ ఒకటే, పరతత్త్వము, ద్రష్ట, పూర్ణము, స్వయంజ్యోతి, అవ్యయము. ఈ ఆత్మ మాయాకార్యములగు స్థూల, సూక్ష్మ, కారణశరీరములచే ఆచ్ఛాదితమై యున్నది. కావున బ్రహ్మవిచారముద్వారా ఆత్మను ఈమూడు శరీరములనుండి వేరుగా గ్రహించవలెను.

ఆ శ్రీగీత :—

*యథాఽగాధనిధేర్లబ్ధౌ నోపాయః ఖననం వినా।*
*మల్లాభేఽపి తథా స్వాత్మచిన్తాం ముక్త్వా న చాపరః ॥*

"భూమిలో దాచిన ధనమును పొందుటకు త్రవ్వుటతప్ప వేరు ఉపాయము లేనట్లు నన్ను పొందుటకు స్వరూపధ్యానముతప్ప వేరు ఉపాయము లేదు."

దేహోపలమపాకృత్య బుద్ధికుద్దాలకాత్పునః ।
జ్ఞాత్వా మనోభువం భూయో గృహ్ణీయాన్మాం నిధిం పుమాన్ ॥

"శరీరమనెడు రాతిని తప్పించి బుద్ధిఅనెడు గునపముతో మనస్సు అనెడు భూమిని త్రవ్వి నిధివంటి నన్ను తీసికొనవలెను."

ఆత్మతత్త్వమును తెలిసికొనదలచినవాడు దేహమనెడు రాతిని తప్పించవలెను. మహాబలశాలియగు ఏనుగు బండరాతిని విసరి వేసినట్లు వైరాగ్యము, ఆత్మబలము కల ముముక్షువు దేహాభిమానమును నెట్టివేయగలడు.

## దేహాభిమానము వలన కలుగు అనర్థము

అవిద్యచే అంతరాత్మను మరచి అజ్ఞానావృతమగు దేహమే ఆత్మఅని దానిని సేవించును; దానిని అలంకరించును; దానికి అనేక సుఖములు కలుగజేయుటయే కర్తవ్యముగా తలచును. ఎల్లకాలముల యందు దానిని సువాసనగల సబ్బులతో రుద్ది పలుమార్లు శుభ్రము చేయును. తల దువ్వి, నిమిషనిమిషమునకు అద్దములో ముఖము చూచుకొనును. అందముగను, ఫేషనుగను ఉండు బట్టలు కట్టుకొనును. రోజుకు రెండుమారులు బట్టలు మార్చును. ఇంటిలో సుఖముగా విశ్రమించుటకు మెత్తని ఆసనములను ఏర్పాటుచేయును. నిద్రించుటకు అందమగు హంసతూలికాతల్పమును ఏర్పరచుకొనును. తినుటకు అనేకపదార్థములు సంపాదించును. ఉండుటకు బంగళా, తిరుగుటకు మోటారుకారు, చూచుటకు నాటకములు, సినిమాలు మొదలగువాటియందు జీవితమంతయు వ్యర్థము చేయును. ఏదో ఒక రోజున నిప్పునకో, భూమికో పాలగు ఈ అనిత్యశరీరముకొరకు ధనము సంపాదించుటకై అనేక కార్యక్రమములను పైన వేసికొని జీవితమంతయు గడపును. నిత్యమును, అవినాశియు, సుఖస్వరూప

మును అగు ఆత్మను మరచి ఇతరములను ఆరాధించినవానికి ఇంత కన్న మహానర్థమేమి ఉండును?

శ్రీ శంకరులు ఇట్లు చెప్పిరి .—

*అనుక్షణం యత్పరిహృత్య కృత్యమనాద్యవిద్యాకృత బన్ధమోక్షణమ్ ।*
*దేహః పరార్థోఽయమముష్య పోషణే యః సజ్జతే స స్వమనేన హన్తి॥*

"ఎవడు, అనాదియగు అవిద్యచే కలిగిన బంధమునుండి విడుదలకై అనుక్షణము ప్రయత్నింపక, పరార్థమగు (కాకగృధ్రాదులకు భక్ష్యమగు) ఈ దేహమును పోషించుటకు ఆసక్తుడగునో వాడు ఆత్మఘాతకు డగును."

అవిద్య అనగా అనిత్యమును నిత్యమనియు, దుఃఖమును సుఖమనియు, అపవిత్రమును పవిత్రమనియు, అనాత్మను ఆత్మ అనియు తలచుట.

**అనిత్యపదార్థమును నిత్యముగా తలచుట:** — శరీరము అనిత్యము. క్షణభంగురము. మన కండ్లయెదుటనే మనుష్యులు చనిపోవుదురు. వారు చూచుచుండగనే తాను ఎప్పుడును చనిపోవను కొని పెద్దపెద్ద భవనములు కట్టించును; భూములు సంపాదించును; ధనమును నిలువచేయును. వానికొరకు ఎంతయో కష్టపడి పనిచేయును. అనగా శరీరము నిత్యమని తలంచియే ఇట్లు చేయును.

**దుఃఖమును సుఖముగా తలచుట** :—ఆధ్యాత్మికము ఆధిదైవికము, ఆధిభౌతికము అని దుఃఖములు మూడు రకములు. వానిని మనుష్యులు అనుభవించవలెను. శరీరము దుఃఖస్వరూపము. అది అనేక అసాధ్యరోగములను అనుభవించును. ఎన్నియో కష్టములను పొందును. వానిని మరచి శరీరమునందు సుఖమున్నదని అనుకొందురు. శరీరము రోగాదులచే పీడింపబడకపోయినను, అన్నిటికంటె పెద్దదగు మృత్యువు అనుదుః

ఖము తప్పదు. వీటి నన్నిటిని మరచి శరీరమునందు సుఖమును భావించును.

**అపవిత్రమును పవిత్రముగా తలచుట :–** శరీరము మాంసము, రక్తము, మలమూత్రములు మొదలగు దుర్గంధపదార్థ ములతో నిండియున్నది. అయినను దేహధారి ఆశరీరమును రకరక ములగు వస్త్రాలంకారములతో అలంకరించును. తనను అందముగా చూపించుటకు ప్రయత్నించును. శరీరమునుండి పుట్టు దుర్గంధమును పోగొట్టుటకు అనేక సుగంధపదార్థములను ఉపయోగించును. ఇట్లు శరీరము పవిత్రమైనదని నమ్మును.

**అనాత్మను ఆత్మగా తలచుట :–** దేహము తాను కాదు. అందుచే అది అనాత్మ. దేహమునందు ఉన్న జీవాత్మ దానికి సంబం ధించినది కాదు. అయినను దేహము నేను అనుకొనును. ఇంటిలో నున్నవారు ఇంటికంటె వేరు. అయినను అజ్ఞానముచే అతడు నేను ఇల్లు అనుకొనుట ఎట్లు నిజము కాదో అటులనే ఇదియుకూడ నిజము కాదు.

ఈ అనుకొనుట అనాదియగు అవిద్య తెచ్చిపెట్టిన బంధ నము; పెద్ద చిక్కు. ఈ చిక్కునుండి బయటపడుటకు అహోరా త్రములు తదేకదీక్షతో పనిచేయుటకు బదులు పరోపయోగియగు మాంసపుబొమ్మయందు (మరణానంతరము ఈశరీరమునకు నాలుగు రకములగు సంస్కారములు కలుగవచ్చును.అగ్ని, జల, భూ, పశుపక్షి సంస్కారములు. తద్వారా ఇతరజీవులకు ఉపయోగపడును.) ఆత్మ బుద్ధిని ఉంచి రకరకములగు అన్నపానములయందును, వైభవాదుల యందును ఆసక్తిని చూపుటయందును నిమగ్నులగుదురు. తనస్వరూప మును, కర్తవ్యమును మరచిపోవును. అట్టివారు తమనాశనమును

తామే చేసికొనెదరు. అంటే తన కాలును తానే గొడ్డలితో ఛేదించు కొనుచున్నా డన్నమాట.

కర్తవ్యదృష్టితో పరిశీలించి చూచినచో శరీరము అమూల్యమైనది. ఇది మోక్షసాధనము. అయినను వస్తుతః ప్రత్యక్షనరకము. మోక్షద్వారమగు శరీరమును పొందికూడ మోక్షమును సాధింపక బ్రతికి ఉన్నంతకాలము శరీరమును ప్రేమించుచుండుటచే మానవుడు తనను తానే నశింపజేసికొనుచున్నాడు.

350 సంవత్సరములకు పూర్వము మద్రాసులో ఒక వర్తక శ్రేష్ఠుడు ఉండెను. ప్రజలు అతనిని కుబేరుని అవతారముగా భావించుచుండిరి. ఆతడు యౌవనమునందే సంసారబంధములను పూర్తిగా త్యజించెను. ఆత్యాగమునకు అంతులేదు. నేలమీదపడి బుగ్గిలోకూడ దొర్లుచుండెడివాడు. ఆయన తానువ్రాసిన ఒకపద్యమునందు ఇట్లు నుడివెను:—

"ఈశరీరము ఎప్పుడు మృత్యుముఖమున పడునా, ఎప్పుడు మేము తినెదమా అని పశుపక్ష్యాదులు ఉవ్విళ్ళూరుచున్నవి. నేను భక్షించెదనని అగ్ని పరవళ్ళు త్రొక్కుచున్నది. నావంతు అని భూమి కనిపెట్టుకొన్నది. మాకు కావలెనని జలచరములు తలపోయుచున్నవి. ఈ నశ్వరమగు మురికి శరీరమును మృష్టాన్నములతో పెంచి, సుందరమైన వస్త్రభూషణములను ధరింపజేసి, వెండిపల్లకీలో కూర్చుండబెట్టి ఎందరో ప్రేమింతురు. అట్లు నేను ఎందుకు చేయవలెను? ఇంత పెద్ద తప్పు చేయుటయేనా?"

ఇట్లు మహాత్ములయినవారు అందరు వైభవములను త్యజించి శరీరమునందు పరిపూర్ణవైరాగ్యమును పాటించెదరు. అప్పుడే వారు తమ కర్తవ్యమును సాధింతురు.

అవిద్యాబంధనమునుండి ముక్తిని పొందుటకు పురుషప్రయత్నమును చేయవలెను. ఇది యథార్థము. ఆ లక్ష్యమునుండి చలించి దేహపోషణమునకు ఉద్యుక్తుడగుటవలన లాభమేమి? అను సందేహము కలుగవచ్చును. సజీవముగా నుండుటకే దేహమును పోషించవలెను. అంతియేకాని, అనేక వైభవములను అనుభవించుటకు ద్రవ్యాదులను సంపాదించుచు, విషయభోగములయందే మునిగియుండి జీవితము గడపుచు ఉన్నచో సంసారబంధమునుండి ముక్తినొందుట అసంభవము. అవసరములకు అంతులేదు. కావున వానితో సంబంధము, ఆత్మను తెలిసికొనవలె ననెడు కోరిక— ఈ రెండును ఒకేమారు జరుగవు. అవి పరస్పర విరుద్ధములు.

శంకరభగవానుడు ఇట్లు చెప్పెను:—

*శరీరపోషణార్థీ సన్ య ఆత్మానం దిదృక్షతే ।*
*గ్రాహం దారుధియా ధృత్వా నదీం తర్తుం స ఇచ్ఛతి ॥*

"శరీరమును పోషించుటయందే నిమగ్నుడయి ఆత్మను తెలుసుకొనదలచువాడు కర్ర అనుకొని పొరబాటున మొసలిని పట్టుకొని నదిని దాటగోరుచున్నాడు."

శరీరమునకు వైభవము కలుగజేయుట, ఆత్మను తెలిసికొనుటకు వలయు అభ్యాసముచేయుట– ఈ రెండును పరస్పర విరుద్ధ ధర్మములు.

## ఆలోచించి చూచిన శరీరము ప్రత్యక్ష నరకము.

"కోవాఽస్తి ఘోరో నరకః, స్వదేహః" (మణిరత్నమాల)

"ఘోరనరకము ఏది? తన శరీరమే." ఈ నరకశరీరమును ఆత్మ అనుకొని దానియందు ప్రేమ కలిగియుండుటకంటె వేరు అజ్ఞానము లేదు.

*మాంసాసృక్ పూయవిణ్మూత్రస్నాయుమజ్జాస్థిసంహతౌ ।*
*దేహే చేత్ప్రీతిమాన్మూఢో భవితా నరకేఽపి సః ॥*

"మాంసము, రక్తము, చీము, మలము, మూత్రము, పేగులు, క్రొవ్వు, ఎముకలు అను వస్తువుల సమూహమగు శరీరముపై ప్రేమ కలిగియుండు అవివేకి నరకమునుకూడ ప్రేమించగలడు." మలము నందలి పురుగు మలమునందు ఆనందించునట్లు దేహాభిమానియగు జీవుడు దేహమనెడు నరకమునందు ఆనందమును పొందును.

## దేహముపై విరక్తి.

ఆత్మ, అనాత్మ వివేకముచేసి స్థూలదేహమునందు విరక్తిని పొందవలెను. అహంభావమును విడనాడవలెను. శరీరమునందు విరక్తిని పొందుటకు రెండురకముల ఆలోచనలు కారణములు. 1. ఈశరీరము అపవిత్రము. 2. ఇది అనిత్యము. ఈశరీరమును మంచిభోజనముతో పెంచుటవలన కలుగు పరిస్థితి ఆలోచించిన తెలియగలదు.

ఒక శిష్యుడు గురువుగారివద్దకు జ్ఞానమును పొందుటకు వెళ్లెను. గురువు అతనిని వైరాగ్యమును పొంది రమ్మని చెప్పెను.

శిష్యుడు:—సంసారమును విడచి వచ్చితిని. ఇక దేనినుండి విరక్తిని పొందవలెను?

గురువు:—దేనినుండి విరక్తిపొందవలెనో, అది ఇంతవరకు నీకు తెలియలేదు.

శిష్యుడు:—నేను దేనినుండి వైరాగ్యము పొందవలెనో ఇంకను అట్టిది ఏదైన ఉన్నదా?

గురువు:—నీవు ఈ ప్రపంచమున తుచ్ఛాతితుచ్ఛమని యే వస్తువును అసహ్యించుకొందువో దానినుండి వైరాగ్యమును చెందవలెను.

శిష్యుడు:—అట్టి వస్తువు 'మలము' అని అ[illegible]చున్నాను.

గురువు:—దానిని అడిగి చూడుము. అదియే నీకు తెలియ జేయును.

అంతట శిష్యుడు మలమువైపు చూచి అడుగగా దానినుండి, మలరూపమున నున్న సీమరేగుపండు (ఏపిల్ పండు) బయటకు వచ్చి, అయ్యా! నిన్న సాయంకాలమువరకు బజారులో దుకాణముమీద ఎంతో అందముగా అందరి దృష్టిని ఆకర్షించి ఉండేదానను. నీవు నన్ను కొని, భుజించినపిమ్మట, నీదేహములో ప్రవేశించి ఈ పాడు మలరూపమును చెందితిని. ఇంతలో మలరూపమున నున్న లడ్డు వచ్చి, అయ్యా! నిన్న రాత్రివరకు మిఠాయిదుకాణముమీద బంగారువన్నెతో మెరుస్తూ ఉండేదానను. నీ శరీరసంసర్గము చెందినతోడనే నాకు ఈ వికృతి మలరూపము సంభవించినది. (ఈసంభాషణము, విషయము సుబోధమగుటకు చమత్కారముగా నియ్యబడినది.) అంతట శిష్యుడు ఈ దేహమే సర్వాసహ్యమైన తుచ్ఛాతితుచ్ఛవస్తువు అని నిశ్చయించుకొని దీనినుండియే వైరాగ్యము చెందవలసియున్నదని భావించి యిట్లు చెప్పెను:—

శిష్యుడు:—గురువుగారూ! నాకిప్పుడు తెలిసినది. ఈ దేహము కంటె పాడు వస్తువు ఇంకొకటి లేదు. దీనినుండియే వైరాగ్యమును చెందవలసియున్నట్లు గ్రహించితిని.

గురువు:—అదియే నిజము. ముక్తికోపనిషత్తునందు ఇట్లు చెప్పబడినది:—

*స్వదేహాశుచిగన్ధేన న విరజ్యేత యః పుమాన్ ।*
*విరాగకారణం తస్య కిమన్యాదుపదిశ్యతే ॥*

"తన శరీరపు అపవిత్రదుర్గంధమునుండి ఎవనికి విరక్తి కలుగదో అతనికి వైరాగ్యకారణము మరియొకటి ఉపదేశింపదగినది ఏమి ఉండును?"

## శరీరపు అనిత్యత్వము.

శరీరమునందు విరక్తిని పొందుటకు రెండవకారణము శరీరపు అనిత్యత్వము. మహారాజగు గోపీచంద్రుడు మేనావతికి ఏకైక పుత్రుడు. సౌందర్యశాలి. ఒకప్పుడు ఆయన తన రాజభవనమున రత్నములు పొదగబడిన పీటమీద స్నానార్థము కూర్చొనియుండెను. ఎనమండుగురు పట్టపురాణులు ఆయనను అనేకరకములగు సుగంధ ద్రవ్యములతో స్నానము చేయించుచుండిరి. ఆసమయమున మేనావతి భవనమునందు కిటికీచెంత కూర్చొనిఉండెను. ఆమెదృష్టి గోపీచంద్రునిపై బడెను. ఆమె ఇట్లనుకొనెను :—

సృష్టిరహస్యము ఎంత ఆశ్చర్యకరము? కాముని మోహములో చిక్కుకొనిఉన్న ఈ శరీరమునుండి ప్రాణములు అనబడు పక్షులు ఎగిరిపోయినప్పుడు, ప్రాణములు లేని ఈశరీరము ఎంతభయంకరముగా నుండును? యముని వలలో చిక్కుకొన్నప్పుడు ఈ అందమగు శరీరమును చూచువారు ఎవరును ఉండరు. ఈ ఆలోచనా ప్రవాహములో ఆమె ఏడ్వసాగెను. ఈసంగతి గోపీచందునకు తెలిసి తల్లిచెంతకు వెళ్ళి విచారించుటకు కల కారణము అరయగోరెను. అంతట ఆమె ఇట్లు చెప్పెను. "కుమారా! నీకొరకే విచారించుచున్నాను. నీతండ్రి, అతని బంధువులు, అందరును భస్మమయిపోయిరి. వారందరు ఒకప్పుడు నీవలెనే మురిసిపోవుచుండెడివారు. వారి శరీరములవలె నీశరీరముకూడ భస్మము అయిపోవును అను ఆలోచన తట్టుటతోడనే ఏడ్పు వచ్చినది. "నీవు మృత్యువును జయించుము." అని ఆమె ఉపదేశించెను. ఆ ఉపదేశము విని అతడు రాజ్యత్యాగము చేసి ముక్తిమార్గమున నడచెను.

## మృత్యుదృక్పథముతో విషయభోగములందు విరక్తి

మృత్యువునుగురించి ఆలోచించుటతోడనే మానవునకు విషయములయందు విరక్తి గలుగును. ఉరిశిక్షకు గురికానున్న మానవు

నకు ప్రపంచమునందలి సకల వైభవములను కలుగజేసినను వాని యందు అతనికి ఆసక్తి ఉండునా?

*మస్తకస్థాయినం మృత్యుం యది పశ్యేదయం జనః।*
*ఆహారోపి న రోచేత కిముతాన్యా విభూతయః॥*

"తలపై నురుకుటకు సిద్ధముగానున్న మృత్యువును చూచి నచో తినుటకు తిండికూడ రుచించదు. ఇతర ఐశ్వర్యముల సంగతి ఏమి?" అటులనే తీవ్రవైరాగ్యమును పొందుటకు బ్రహ్మవిద్యావేత్త యగు గురుని చెంతకు వెళ్ళవలెను.

**బ్రహ్మజ్ఞుల ఉపదేశము :-**

*తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్సమిత్పాణిః*
*శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్। (శ్రుతి)*

"చేతితో సమిధలు పట్టుకొని బ్రహ్మజ్ఞానమును పొందుటకు శ్రోత్రియుడును, బ్రహ్మజ్ఞుడును అగు గురుని చెంతకు వెళ్ళవలెను."

గురువు శ్రోత్రియుడును, బ్రహ్మనిష్ఠుడును అయి ఉండవలెను. ఉత్తమజిజ్ఞాసువునకు బ్రహ్మనిష్ఠుడగు గురువు ఉపదేశించినంతమాత్ర మున నే జ్ఞానము కలుగును. కాని మందజిజ్ఞాసువునకు మనస్సునందు సంశయములు ఉండును. తర్కవితర్కములు చేయును. కావున ఆతడు బ్రహ్మనిష్ఠుడును శ్రోత్రియుడును అగు గురుని చేరవలెను. అతని మనస్సునందలి సందేహములు నిర్మూలింపబడినతరువాత నే అతనికి జ్ఞానము కలుగును.

శిష్యుడు సమిత్పాణి అయి గురువును సమీపించవలెను. యజ్ఞాగ్నికి ఉపయోగించు సమిధలనుమాత్రమే పట్టుకొని వెళ్ళ వలెను. ఇతర వస్తువులను కానుకలుగా తీసికొని వెళ్ళరాదు. అనగా గురువు కోరికలు కలిగి ఉండరాదనియు, పరిగ్రహమును చేయరా దనియు శిష్యుడు తెలిసికొనినవాడై యుండవలెను.

ఒకరోజున సమర్థరామదాసు మాహులీసంగమమున స్నానము చేసి భిక్షాటనము చేయుచు శివాజీ భవనమునకు వెళ్ళెను. "జయశ్రీ రఘువీరసమర్థ" అని గర్జించి భిక్షను కోరెను. సమర్థుని వాణిని విని నంతనే శివాజీహృదయము ఆనందపరవశ మయ్యెను. సద్గురువుల జోలిలో ఏమి సమర్పించవలెనని ఆయన ఆలోచించెను. పిదప ఆయన ఒకకాగితముపై "శ్రీసమర్థుల చరణములయందు రాజ్య మంతయు సమర్పించుచున్నాను." అని వ్రాసి మోహరువేసెను. ఆ కాగితమును సమర్థులజోలిలో వేసి సాష్టాంగనమస్కారము చేసెను. ఇది చూచి సమర్థులు అడిగిరి. "ఏమి శివా! ఇదెట్టి భిక్ష? గుప్పెడు అన్నము జోలిలోవేసినచో మధ్యాహ్నపుభోజనము సిద్ధించునుకదా!" ఈకాకితపుముక్కతో భిక్ష యేమిటి? అనుచు కాగితమును జోలి నుండి తీసి చదివెను. శివాజీ రాజ్యమునంతను తనకు సమర్పించినట్లు తెలిసికొనెను. సమర్థులు "శివా! ఈరాజ్యమంతయు నాకిచ్చివేసితివి. ఇంక నీవేమి చేయుదువు?" అని అడిగెను. శివాజీ చేతులు జోడించి వినయముతో చెప్పెను—"తమ చరణముల సన్నిధిని రోజులు గడపె దను." ఇది విని సమర్థులు నవ్వి చెప్పెను—"అబ్బాయీ! ఎవరిపనిని వారు చేయవలెను. బ్రాహ్మణుడు జపతపాదులుచేసి జ్ఞానమును సంపాదించవలెను. క్షత్రియుడు క్షాత్రధర్మమును పాటించవలెను. ఇటులనే తమతమ పనులతో ఎల్లరును ముక్తిని పొందుదురు. తమ విధులను నిర్వహించుటచే జన్మ సార్థకమగును. పూర్వము శ్రీరామ చంద్రుడు కూడ తన గురువగు వసిష్ఠునకు అర్ధరాజ్యమును సమర్పిం చెను. కాని, వసిష్ఠుడు ఆసమయమున శ్రీరామునకు యోగవాసిష్ఠ రూపమున నీతి, న్యాయ, ధర్మములను ఉపదేశించి ఆరాజ్యము నాత నికి ఇచ్చివేసెను. జనకమహారాజుకూడ యాజ్ఞవల్క్యునకు రాజ్య దానము చేసెను. కాని, ఆయన దానిని స్వీకరించలేదు. జనకునకు

రాజనీతిని, ధర్మమును ఉపదేశించెను. కావున, ఓశివా! మావంటి విరాగిసాధువులకు రాజ్యముతో పనియేమి? ఒకవేళ మావంటి బైరాగులు రాజ్యమును స్వీకరించినను దానిని పాలించుటకు యోగ్యుడగు ప్రధాని కావలెనుకదా! కావున, నిన్ను నీవు ఆప్రధానిగా భావించుకొని, 'రాజ్యము సమర్థునిదే' అనుకొని పాలించుము." ఈ ఉపదేశముతో శివాజీఅంతరంగము ఆనందపరవశ మయ్యెను. రాజ్యమును మరల గ్రహించక తప్పదనుకొనెను. కావున, శివాజీ సమర్థుని ఇట్లు ప్రార్థించెను:—"స్వామీ! దయతో తమ పాదుకలను నా ం దయచేయుడు. వానిని సింహాసనముపై ఉంచి తమ ప్రధాని ాపమున నేను రాజ్యమును నిర్వహింతును. సమర్థులు ఈప్రార్థనను అంగీకరించెను. అప్పటినుండియు శివాజీ తనరాజ్యపు జండాను కాషాయవర్ణమున ఉంచెను. మహారాష్ట్రిలలో ఈకాషాయ పతాకము చరిత్రప్రసిద్ధము.

## బ్రహ్మజ్ఞుల లక్షణము.

శ్రోత్రియుని వానిపాండిత్యమునుబట్టి తెలిసికొనవచ్చును; కాని బ్రహ్మజ్ఞుని తెలిసికొనుట ఎట్లు?

శ్రీశంకరులు బ్రహ్మజ్ఞునిగూర్చి స్పష్టముగా నుడివిరి:—

*శ్రోత్రియో బ్రహ్మనిష్ఠో యః ప్రశాన్తః సమదర్శనః ।*
*నిర్మమో నిరహఙ్కారః నిర్ద్వన్ద్వో నిష్పరిగ్రహః ॥*
*అనపేక్షః శుచిర్దక్షః కరుణామృతసాగరః,*
*ఏవంలక్షణసంపన్నః స గురుర్బ్రహ్మవిత్తమః ॥*

"వేదములు చదివినవాడును, బ్రహ్మధ్యానపరాయణుడును, శాంతుడును, సమబుద్ధికలవాడును, మమత్వము లేనివాడును, అహంకారము లేని ుడును, సుఖదుఃఖాది ద్వంద్వములకు అతీతుడును, పరిగ్రహము లేనివాడును, కోరికలులేనివాడును, పవిత్రుడును,

సమర్థుడును, కరుణాసముద్రుడును, అయిన గురువు బ్రహ్మజ్ఞులలో ఉత్తముడు."

## శ్రవణమననాదులు.

శ్రవణము :—ఉపక్రమాది షడ్లింగముల ద్వారా వైదిక శబ్దరూపప్రమాణగతమగు అసంభావనను నిర్మూలించి వేదాంతవాక్యముల తాత్పర్యమును అద్వితీయపరబ్రహ్మమునందు నిశ్చయించుట శ్రవణము.

మననము :—శ్రవణలబ్ధమగు పరబ్రహ్మమునకు సంబంధించిన ప్రమేయగతమగు అసంభావనను నిర్మూలించి శ్రుతి తదనుగృహీయుక్తులద్వారా చింతించుట మననము. ఇట్లు ప్రతిపాద్యమగు అర్థము ఇతరయుక్తులద్వారా కూడ ప్రతిపాదించుటకు వీలుపడును అను నిశ్చయము కలుగుటకూడ మననమే.

ధ్యానము :—విజాతీయజ్ఞానమును తిరస్కరించి సజాతీయ జ్ఞానప్రవాహమును నడిపించుట ధ్యానము. స్థూలశరీరము నేను కాదు, సూక్ష్మశరీరము నేను కాదు, కారణశరీరముకూడ నేను కాదు, అని అన్నిటిని నిషేధించుచు,వాటి అన్నిటికి అధిష్ఠానచైతన్యము నేను అను భావమునందు మాత్రము ఏకాగ్రతను కలిగియుండుట ధ్యానము.

*దేహాభిమానం విధ్వస్య ధ్యానాదాత్మానమద్వయమ్ ।*
*పశ్యన్మర్త్యోఽమృతో భూత్వా హ్యత్ర బ్రహ్మ సమశ్నుతే॥*(పంచదశి)

ధ్యానముతో దేహాభిమానమును ధ్వంసముచేసి, అద్వితీయ ఆత్మసాక్షాత్కారము కావించుకొను మనుష్యుడు అమరుడయి ఈ శరీరమున (ఈజన్మలోనే) బ్రహ్మమును పొందును."

తాను బ్రహ్మమే అని నిరంతరము ధ్యానము చేయనంత కాలము దేహాభిమానము నశించదు. అద్వైతసాక్షాత్కారము కలుగదు.

## ఆత్మప్రాప్తికి గురువు, సాధనములును అవసరము.

*తత్త్వం న దుర్యుక్తిభిః :*—చెడ్డయుక్తులతో ఆత్మతత్త్వము తెలియదు. "స్థూల, సూక్ష్మ, కారణ శరీరములకు అధిష్ఠానము నేను నేను కూటస్థుడను, సాక్షిని, దేహాతీతుడను, త్రికాలములయందు నాయందు అవిద్య అనునది లేదు. నేను ఎల్లప్పుడును నిత్యుడను, ముక్తుడను." అను మోసపుచ్చే మాటలతో ఆత్మప్రాప్తి కలుగదు. దీని కొక దృష్టాంతము కలదు.

దక్షిణ దేశమునందలి ఒక మహానగరమున నలుగురు మిత్రులు ఉండిరి. ఒకడు వైద్యుడు. రెండవవాడు గాయకుడు. మూడవవాడు జ్యోతిష్కుడు. నాల్గవవాడు తార్కికుడు. వీరందరు ఒకప్పుడు వేరొక చోటికి వెళ్ళిరి. వంట చేసుకొనుటకై వారు నలుగురు చేయవలసిన పనులను పంచుకొనిరి. గాయకుడు వండుటకు కూర్చొనెను. వైద్యుడు కూరలు తీసికొనివచ్చుటకు వెళ్లెను. జ్యోతిష్కుడు ఆకులు తీసికొనివచ్చుటకు వెళ్లెను. తార్కికుడు నెయ్యి, పాలు మొదలగునవి తీసికుని రావలసిఉండెను. గాయకుడు పాత్రలు తీసికొని వంట మొదలిడెను. కొంచెముసేపటిలో గుడగుడశబ్దము వచ్చెను. గాయకుడు 'స రి గ మ' స్వరములతో తాల లయసమన్వితముగా గానము చేయసాగెను. ఉడుకుశబ్దము తన గానమునకు శృతికలుపుట లేదు. తాళము భేదించుచుండెను. రాగ తాళములు సరిగ చూడుము అని ఒకటి రెండు మార్లు చెప్పెను. పొయ్యి అతని మాటలు పెడచెవిని పెట్టెను. గాయకునికి కోపము ఎక్కువయ్యెను. అంత నాతడు దుడ్డు కర్రతో గట్టిగా కుండలను మోదెను. కుండలు బ్రద్దలయి అన్నాదులు పొయ్యిలో పడెను. పొయ్యి ఆరిపోయెను.

కూరలు తీసికొనివచ్చుటకు వెళ్ళిన వైద్యునకు ఏకూరయును నచ్చుట లేదు. కూరలు రుచిగానే ఉండును కాని ఒకటి పైత్యము, మరొకటి వాతము, ఇంకొకటి శ్లేష్మము చేయును. మరొకటి తెలివి

తేటలను నశింపచేయును. ఇటువంటి కూరలు కొనుట తప్పు అని తలచి అతడు ఊరక తిరిగివచ్చెను.

జ్యోతిష్కుడు ఆకులకు మర్రిచెట్టు వద్దకు వెళ్ళెను. చెట్టు ఎక్కుటకు ఆతడు ఉద్యుక్తుడయ్యెను. ఇంతలో బల్లి మూడుమారులు కూసెను. చెట్టు ఎక్కినచో ఏదో ప్రమాదము సంభవించును అని తలచి జ్యోతిష్కుడు ఆకులు కోయకుండ వెనుకకు మరలెను.

తార్కికుడు నెయ్యి, పాలు తెచ్చుటకు వెళ్ళెను. త్రోవలో ఆతనికి తట్టెను. నేతికి గిన్నె ఆధారమా, లేక గిన్నెకు నేయి ఆధారమా అను సందేహము కల్గెను. ఈ సంశయము నివారించుకొనుటకు ఆతడు తన చేతియందలి పాత్రలను బోర్లించి చూచెను. వానిలోని వస్తువులు క్రింద పడిపోయెను. అతడుకూడ రిక్తహస్తములతో తిరిగివచ్చెను.

ఇప్పటి వారు ఈవిధముగానే కుతర్కములుచేసి ఆత్మతత్త్వమును తెలిసికొనకయే పారిపోవుదురు. ఇట్టివారికి తెలియుట కూడ అసంభవము.

కఠోపనిషత్తునందు నచికేతునకు యమధర్మరాజు ఇట్లు చెప్పెను:-

"నైషా తర్కేణ మతిరాపనేయా ప్రోక్తాఽన్యేనైవ సుజ్ఞానాయ ప్రేష్ఠ।
యాం త్వమాపః సత్యధృతిర్బతాసి త్వాదృఙ్నో భూయాన్నచికేతః ప్రష్టా॥"

"ఈబుద్ధి తర్కముచే లభించదు. ఓ ప్రియమైనవాడా! గురూపదేశమువలననే ఆ ఆత్మసాక్షాత్కారము కలుగును. అది నీకు కలిగినది. నీవు నిజముగా పట్టుదల కలవాడవు. నీవలె అడుగువాడు మరియొకడు లేడు.

ఈ చర్చానంతరము శ్రీప్రకాశానందస్వామివారు ఇట్లు చెప్పిరి:-

"నేడు చాల ఆలస్యము అయినది. దాదాపు 11 గంటలయినది. ఇది విశ్రమించు సమయము."

అంతట అందరు విశ్రమించుటకు వెళ్ళిరి.

—0—